హరియాణా కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా బీకే హరిప్రసాద్



బెంగళూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ బీకే హరిప్రసాద్‌ను హరియాణా రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా ఏఐసీసీ ప్రకటించింది. శుక్రవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొన్ని రాష్ట్రాలకు ఇన్‌చార్జ్‌లను మార్పు చేశారు. హిమాచల్‌ప్రదేశ్, హర్యానా, మధ్యప్రదేశ్, తమిళనాడు, జార్ఖండ్, తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు కొత్త ఇన్‌చార్జ్‌లను నియమించారు. మంత్రి పదవి ఆశించి అసంతృప్తితో ఉన్న బీకే హరిప్రసాద్‌కు జాతీయస్థాయి హోదా కల్పించారు.



గుల్బర్గా జెస్కాం కార్యాలయం

కరెంట్.. కష్టాలు..!



- వేసవిలో రోజుకు 19వేల మెగావాట్ల డిమాండ్
- ఇప్పటికే 5వేల సర్దుబాటు
- అదనపు సరఫరా కోసం కసరత్తు
- గృహజ్యోతితో పెరిగిన డిమాండ్
- వ్యయసాయ విద్యుత్‌కూ పెరగనున్న ఒత్తిడి
- పల్లెల్లో కోతలు తప్పవా..?

బెంగళూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఎండలు మండిపోతాయని వాతావరణ పరిశోధనశాఖ హెచ్చరిస్తోంది. గడిచిన నాలుగైదేళ్లతో పోలిస్తే ఈ సంవత్సరం భారీగా వర్షాలు కురిశాయి. రబీ సీజన్‌లోనూ నిరంతరంగా వానలు కొనసాగాయి. ఆ ప్రభావంతో రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులు నిండుకుండలా ఉండడం, దాదాపు నాలుగైదు నెలలుగా జలాశయాలలోనూ నీటిమట్టం ఉండడంతో కాలువల ద్వారా చెరువులు నింపారు. ఇలా రాష్ట్రమంతటా ఎక్కడ చూసినా జలవనరులు పెరగడంతో పంటలసాగు ఆశాజనకంగా ఉంది. ఈ ఏడాది చలి కూడా అధికమే అనిపించింది. దశాబ్దాల కాలంలో లేనంత తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వర్షం, చలి అధికంగా ఉన్నట్లే ఎండలు మండిపోనున్నాయని కొన్నేళ్ల రికార్డు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు. అయితే ఎండలు పెరిగితే విద్యుత్ వాడకం అధికం కానుందని కనీసం రోజూ 19వేల మెగావాట్ల విద్యుత్ అవసరమని ఆ శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మార్చి నుంచి మే నెలాఖరు దాకా మూడు నెలలపాటు విద్యుత్ డిమాండ్ పెరగనుందని, 19వేల మెగావాట్లకంటే ఎక్కువ వినియోగించే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. గత ఏడాది వేసవికంటే ముందుగానే రాష్ట్రంలో విద్యుత్ కొరత తలెత్తుతోంది. 2023లో ఆశించినంత వర్షాలు లేకపోవడంతో జలాశయాల్లో నీరు లేక వెలవెలబోయాయి. 2024 జనవరిలోనే విద్యుత్‌కోతలు విధించారు. గత ఏడాది మే నుంచి జోరుగా వర్షాలు కురవడంతో ప్రాజెక్టులన్నీ కళకళలాడుతున్నాయి. విద్యుత్ ఉత్పత్తి ప్రస్తుతానికి ఆశాజనకంగా ఉంది.

ఈ ఏడాది భారీగా డిమాండ్

2022 వేసవికాలంలో రాష్ట్రంలో సరాసరి విద్యుత్ డిమాండ్ 14,766 మెగావాట్లు ఉండేది. 2023లో 15,100 మెగావాట్లకు పెరిగింది. 2024లో తీవ్రమైన వర్షాభావం కారణంగా 17వేల మెగావాట్లకు చేరింది. ప్రస్తుత వేసవి కాలంలో రాష్ట్ర చరిత్రలో అత్యధికం అనిపించేలా 19వేల మెగావాట్లకు డిమాండ్ రానుందనే అంచనా. ఇది విద్యుత్‌శాఖ చరిత్రలో రికార్డు కానుందని అభిప్రాయపడుతున్నారు.

వ్యవసాయ పంప్‌సెట్లకే అత్యధికం

రాష్ట్రంలో వ్యవసాయ పంటలసాగుకోసం 38లక్షల పంప్‌సెట్‌లు ఉన్నాయి. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌లో 36శాతం వ్యవసాయ పంప్‌సెట్లకే వినియోగించాల్సి వస్తోంది. నివాసాలు, పరిశ్రమలకంటే వ్యవసాయ పంప్‌సెట్లకు అత్యధికంగా కేటాయించాల్సిన పరిస్థితి ఉంది. 2024లో భారీగా వర్షాలు కురుస్తున్నందున ఈ ఏడాది పంటలసాగు రాష్ట్రంలో 104 లక్షల హెక్టార్లలో సాగుతోంది. పంటలకు నీరు సమకూర్చేందుకు రైతులు ఎక్కువగా పంప్‌సెట్లను వినియోగిస్తారు. పంప్‌సెట్లకు రోజుకు 7 గంటలపాటు త్రీఫేజ్ విద్యుత్‌ను సమకూరుస్తున్నారు. అందులో పగటివేళల్లో 4 గంటలు, రాత్రిళ్లు 3 గంటలు విద్యుత్ కేటాయిస్తున్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు పంప్‌సెట్ల వాడకానికి 36శాతం కేటాయిస్తుండగా వేసవిలో ఉత్పత్తిలో 40శాతానికి చేరే అవకాశం ఉంది.

రాష్ట్రంలో ప్రస్తుతం 17వేల మెగావాట్ల విద్యుత్ వాడకం సాగుతోంది. జలవిద్యుత్ స్థావరాలు, పవన విద్యుత్, థర్మల్ విద్యుత్, సోలార్ తో కలిపి అన్ని విధానాల ద్వారా 12వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. కేంద్రీయ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు (సీజీఎస్) నుంచి 3,521 మెగావాట్లు సమకూరుస్తోంది.

- రాష్ట్రంలో ప్రస్తుతం విద్యుత్ వినియోగం : 17వేల మెగావాట్లు
- ఉత్పత్తి అవుతున్న విద్యుత్ : 12వేల మెగావాట్లు
- వేసవిలో డిమాండ్ అవకాశం: 19వేల మెగావాట్లు
- జలవిద్యుత్ ఉత్పత్తి : 2465 మెగావాట్లు
- థర్మల్ పవర్ : 3679 మెగావాట్లు
- సౌర విద్యుత్ : 6000 మెగావాట్లు
- పవన విద్యుత్ : 65 మెగావాట్లు
- రాష్ట్రంలో వ్యవసాయ పంప్‌సెట్లు : 38 లక్షలు
- రోజుకు 7 గంటల త్రీఫేజ్ కేటాయింపు
- ఉత్పత్తిలో వాడకం :36శాతం


శరావతి విద్యుత్ ప్రాజెక్టు

నేషనల్ సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్రిడిక్షన్ (ఎన్‌సిఈపీ) ద్వారా 1002 మెగావాట్లు సమకూరుతోంది.

దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోళ్లకు కసరత్తు

గత ఏడాది వేసవిలో విద్యుత్ కొరత తీవ్రమైనందున విద్యుత్‌శాఖ ఈ ఏడాది సమర్థవంతంగా నిభాయించేందుకు ముందస్తుగానే సిద్ధమవుతోంది. దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలకు కసరత్తు చేస్తోంది. పంజాబ్, ఉత్తరప్రదేశ్‌తోపాటు పొరుగు రాష్ట్రాలనుంచి ఫిబ్రవరిలో 400 మెగావాట్లు, మార్చి నుంచి మే వరకు వెయ్యి మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు కసరత్తు చేస్తున్నారు. దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోళ్లకు ప్రయత్నిస్తే తక్కువధరకే విద్యుత్ లభిస్తుందని తాత్కాలిక కొనుగోళ్లకు ప్రయత్నిస్తే ఇంధనశాఖకు భారం కానుందని అధికారులు భావిస్తున్నారు.

గృహజ్యోతితో మరింత ఒత్తిడి

రాష్ట్రంలో విద్యుత్ వాడకం పెరిగేందుకు గృహజ్యోతి గ్యారెంటీ కూడా కారణమవుతోంది. గృహజ్యోతిపథకం ద్వారా ఉచితంగా విద్యుత్ సమకూరుస్తున్నందున ప్రజలు ఇష్టారాజ్యంగా కరెంటు వాడుతున్నారు. తద్వారా విద్యుత్ డిమాండ్ 34శాతం ఎక్కువ అవుతోంది. వేసవిలో గృహజ్యోతి పథకం లబ్ధిదారులు మరింత ఎక్కువ వాడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

చిరుత దాడిలో ఆవు మృతి

రాయచూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): నగర సమీపంలోని మలియాబాద్ అటవీ ప్రాంతంలో చిరుత దాడి చేయడంతో గోశాలలోని ఆవు మృత్యువాతపడింది. ఈ సంఘటన శుక్రవారం రాత్రి జరిగినట్లు గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మేత మేయడానికి అడవి సమీపంలోకి వెళ్లిన ఆవుపై చిరుత దాడి చేసి చంపేసింది. ఆవు కళేబరం చూసిన గ్రామస్థులు అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. మూడు మాసాల క్రితం ఇదే రీతిలో చిరుత ఒకటి గోశాల పై దాడి చేయగా రెండు ఆవులు మృత్యువాతపడ్డాయని అయినా ఇప్పటి వరకు అటవీ శాఖ అధికారులు చిరుతను బంధించడంలో విఫలమయ్యారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని చిరుత జాడలను గుర్తించి బంధించాలని కోరుతున్నారు. కాగా మలియాబాద్ గ్రామ సమీపంలోని గోశాల పై చిరుత దాడి జరిగిన విషయం తెలుసుకున్న గ్రామస్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

భార్యను హతమార్చిన కేసులో జీవితఖైదు

చింతామణి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): భార్య శీలాన్ని శంకించి మచ్చుతో గొంతుకోసి దారుణంగా హతమార్చిన ఘటనలో భర్తకు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ కోర్టు శనివారం తీర్పునిచ్చింది. చింతామణి తాలూకా బట్లహళ్ళి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొండ్లిగానహళ్ళిలో భార్య వినదమ్మను భర్త సురేష్ దారుణంగా హతమార్చాడు. ఇందుకు సంబంధించి చింతామణి పట్టణం రెండో సెషన్స్ కోర్టు న్యాయాధికారి నాగవేణి తీర్పును వెలువరించారు. నిందితుడు సురేష్‌కు జీవితఖైదు సహా రూ.50వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మూడేళ్లు అదనంగా జైలు అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ శాంతి సుమితిమేరి వాదనలు వినిపించారు. 2023 మే 30న వేకువజామున 5.30 గంటలకు సురేష్ తన భార్యను హతమార్చాడు. ఘటనపై బట్లహళ్ళి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గ్రానైట్ పరిశ్రమను ప్రభుత్వం ప్రోత్సహించాలి 7
- ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ గ్రానైట్ ఇండస్ట్రీ అధ్యక్షుడు కృష్ణప్రసాద్

అస్పృశ్యత కొనసాగడం అనాగరికం

- ప్రజల ఆలోచనల్లో మార్పు రావాలి
- 'అరివు భారత' సేవలు అభినందనీయం: మంత్రి సతీశ్ జార్కిహొళి


జ్యోతిని వెలిగిస్తున్న మంత్రి సతీశ్‌జార్కిహొళి తదితరులు

బంగారపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆధునిక యుగంలోనూ అస్పృశ్యత కొనసాగడం అనాగరికమని, సంపూర్ణ నియంత్రణకు ప్రజల ఆలోచనల్లో మార్పు రావడమే కీలకమని రాష్ట్ర ప్రజాపనులశాఖ మంత్రి సతీశ్ జార్కిహొళి అన్నారు. కోలారులో శనివారం దళిత గృహ ప్రవేశానికి దశాబ్దకాలమైన సందర్భంగా 'అరివు భారత' సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ న్యాయమూర్తి జస్టిస్ నాగమోహన్‌దాస్, జిల్లా అధికారి రవి, అదనపు జిల్లాధికారి మైత్రి తదితరులు పాల్గొన్నారు. అరివుభారత వ్యవస్థాపక అధ్యక్షుడు శివప్ప అరివు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి సతీశ్‌జార్కిహొళి మాట్లాడుతూ కోలారు కర్మభూమిలాంటిదని, ఇక్కడి ఉద్యమ పాటలు రాష్ట్రంలో ఎక్కడ పోరాటం ప్రధానంగా సాగుతాయన్నారు. అరివుభారత సంస్థ ఒక ఆలోచనతో దళిత గృహప్రవేశం, సహపంక్తి భోజనం వంటివి దశాబ్దకాలంపాటు నిర్వహించడం సంతోషమన్నారు. ఇది జిల్లాకే పరిమితం కాకుండా రాష్ట్రమంతటా విస్తరించడం హర్షణీయమన్నారు. దళిత గృహప్రవేశం ఒక ఉద్యమం కావాలన్నారు. ప్రభుత్వం అన్నిశాఖల ద్వారా అస్పృశ్యత నివారణకు పాటుపడుతున్నాయని, అయినా స్వచ్ఛందసంస్థలు ప్రజల్లో అవగాహన పెంచాల్సి ఉందన్నారు. జస్టిస్ నాగమోహన్‌దాస్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలైందని రాజ్యాంగం ఉందని అయినా అస్పృశ్యత కొనసాగడం విచారకరమన్నారు. 'అరివు భారత' వంటి సంస్థలు ఇంకా పెరగాలన్నారు. ఒక ఆశయం, ఆలోచనతో ఏర్పడిన సంస్థ ఎన్నో గ్రామాల్లో సామాజిక చైతన్యం తీసుకురావడం సంతోషకరమన్నారు. విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ త్రిలోక్‌చంద్ర మాట్లాడుతూ కోలారు జిల్లా తనకు పుట్టినిల్లు వంటిదన్నారు. ఇక్కడే డీసీగా సుదీర్ఘకాలం పనిచేశానని, తనకు అన్ని విధాలా అవగాహన, అధ్యయనం పెంచుకునేందుకు కారణమైందన్నారు. అరివు భారత సంస్థతో గతంలోనూ సంబంధం ఉందన్నారు. ఇదే సందర్భంగా కన్నడ అధ్యాపకులు రుద్రేశ్ అదరంగి సంపాదకత్వంలో రూపొందిన 'హొళ హొరగు' పుస్తకాన్ని మంత్రి లాంఛనంగా ఆవిష్కరించారు. వెంకటాచలపతి బృందం ఉద్యమ గేయాల ఆలాపన సభికులను ప్రత్యేకంగా ఆకట్టుకుంది. అరివు భారత సభ్యులు విజయకుమార్, అబ్బగి శివప్ప, పండిత్ ముని వెంకటప్ప, ఆనంద్‌కుమార్, మంజుళ కొండరాజనహళ్ళితోపాటు పలువురు పాల్గొన్నారు.

బెంగళూరులో మొబైల్ తయారీ కేంద్రం

- యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం
- కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్



బెంగళూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో యువతకు ఉపాధి పెంచడమే లక్ష్యంగా మొబైల్ తయారీ విభాగం ఏర్పాటు కానుందని కేంద్ర రైల్వే, సమాచార ప్రసార, ఐటీబీటీశాఖల మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. శనివారం నగరంలోని జగన్నాథ భవన్‌లో రాష్ట్ర పార్టీ నాయకులతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో రూ.12లక్షల దాకా వార్షిక ఆదాయానికి పన్ను మినహాయింపు వంటి కీలక నిర్ణయం తీసుకున్నారన్నారు. 60ఏళ్లలో అభివృద్ధి కాని విభాగాలు ఇటీవలి పదేళ్లలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో సాధ్యమయ్యాయన్నారు. దేశం నలుమూలలా పదేళ్లలో ప్రగతి కనిపిస్తోందన్నారు. మెట్రో, కొత్త ఎయిర్‌పోర్ట్‌లు, 390 కొత్త విశ్వవిద్యాలయాలు, ఐఐటీ, ఐఐఎంవంటివి సాధ్యమయ్యాయన్నారు. రూ.50లక్షల కోట్ల బడ్జెట్‌కు చేరామన్నారు. పదేళ్లక్రితం రైతుల ఆత్మహత్యలు నిరంతరంగా ఉండేవని, ఇటీవల తగ్గాయన్నారు. పెట్టుబడిదారులు భారత్‌వైపు చూస్తున్నారన్నారు. బెంగళూరులో కొత్త ఎయిర్‌పోర్ట్ టర్మినల్ నిర్మించడం ద్వారా ఎక్కువమందికి ఉపాధి లభించిందన్నారు. రైల్వేస్టేషన్‌ల రూపురేఖలు మార్పు జరుగుతోందన్నారు. బెంగళూరులో కనీసం అరలక్ష మందికి ఉద్యోగం కల్పించే మొబైల్ తయారీ విభాగం రానుందన్నారు. సాంకేతికతకు గరిష్ఠంగా బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చారన్నారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర, కేంద్రమంత్రి శోభాకరంద్లాజె, ఎంపీలు పీసీ మోహన్, తేజస్వి సూర్య, డాక్టర్ మంజునాథ్, లెహర్‌సింగ్‌తోపాటు పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ కార్యాలయంలో కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌ను సన్మానిస్తున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

వానర ప్రేమ..!

- కొండల్లో కోతుల దాహం తీరుస్తున్న యువకులు


తొట్టెలో నీటిని తాగుతున్న కోతి


నీటి తొట్టెల్ని నింపుతున్న రమేష్

కంప్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కోతులపై ఆ యువకులకు అపారమైన ప్రేమ.. వానరాల దాహం తీర్చడానికి కొండల్లోకి నీరు తీసుకెళ్లి మరీ తొట్టెలు నింపుతారు. అదీ ఎప్పుడో ఒకప్పుడు..కాదు ఎండాకాలమంతా కోతులకు దప్పిక కాకుండా చూసుకుంటాడు. కుడితిని పట్టణానికి చెందిన గ్రీన్‌ఫౌండేషన్ సభ్యులు వినోద్, రమేష్ పట్టణానికి సమీపంలోని కొండల్లో తమ స్వంత ఖర్చుతో తొట్టెలు ఏర్పాటు చేశారు. రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. ప్రాణి పక్షులకు నీటి దాహం ఇచ్చేందుకు ముందడుగు వేశారు. ఈ సందర్భంగా ఆ యువకులు మాట్లాడుతూ ప్రతి వేసవిలోనూ కొండల్లో కోతులకు, జీవాలకు నీరు పోసి దాహం తీరుస్తున్నామన్నారు. ప్రతి గ్రామాల్లోనూ ఎండాకాలంలో పక్షులు, వన్యప్రాణుల దాహం తీర్చడానికి ముందుకు రావాలన్నారు. అడవుల్లో నీరు లేక ఎన్నో మూగజీవులు గ్రామాలకు చేరుకుని నీటిని తాగి తిరిగి కొండల్లోకి వెళుతున్నాయని, తరచూ అవి ప్రమాదాలకు సైతం గురువతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో పక్షులకి నీటికుండీల్లో నీరు పోసే ఏర్పాటు చేయాలన్నారు. వారి కృషిని ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు.

మిర్చి రైతు కంట్లో కన్నీరు..!

- గిట్టుబాటు ధరలేక నష్టపోతున్న అన్నదాత
- పెట్టుబడులూ రావని కౌలు రైతు ఆవేదన


ధరలేక కల్లాల్లోనే ఉంచిన మిర్చి

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : గిట్టుబాటు ధరలు లేక మిర్చి రైతు విలవిలలాడుతున్నారు. బళ్లారిరూరల్ పరిధిలోని రూపనగుడి, రాయాపురం, శంకరబండ, కమ్మరచేడు బొల్లనగుడ్డం, లక్ష్మీనగర్ క్యాంపు, శంకరబండ క్యాంపు, తదితర గ్రామాల రైతులు ఈ ఏడు విరివిగా మిర్చి సాగు చేశారు. అయితే తీరా పంట చేతికొచ్చే సమయానికి ధరలు పాతాళానికి పడిపోయాయి. ప్రస్తుతం మిరప పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో పండించిన పంటనంతా కల్లాల్లోనే రాశులుగా పోసుకుని ఆందోళన చెందుతున్నారు. గతంలో క్వింటాళ్ మిరప ధర రూ. 20 వేలు ఉండేదని, ఇప్పుడు అమాంతం రూ.9 నుంచి రూ.10 వేలకు పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ధరలకు అమ్మితే కనీసం గిట్టుబాటు కాదని, కనీసం పెట్టుబడి కూడా రాదని వాపోతున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

కౌలుకు తీసుకుని నష్టపోయాం: సుంగప్ప, రైతు



ఈ సారి 22 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేశాను. ఎకరాకు రూ. లక్ష నుండి లక్షన్నర వరకు పెట్టుబడి ఖర్చులు వచ్చాయి. ఇప్పుడున్న ధరకు అమ్మితే కనీసం ఖర్చులు కూడా రావు. ఎన్నో ఆశలతో చేసిన వ్యవసాయం అప్పులు పాలు చేసింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

అనంతను ఆదర్శంగా నిలుపుదాం

ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు

26 మందికి ఉత్తమ డ్రైవర్ అవార్డులు



అవార్డులను అందుకున్న డ్రైవర్లతో ముఖ్య అతిథులు, ఆర్టీసీ అధికారులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణలో అనంతపురం జిల్లాను ఆదర్శంగా నిలుపుదామని ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు పిలుపునిచ్చారు. అనంతపురం డిపో ఆవరణలో శనివారం సాయంత్రం రీజనల్ మేనేజర్ సుమంత్ అధ్యక్షతన రోడ్డుభద్రతా వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కు పూల నాగరాజు, అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్టీఓ సురేష్‌నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పూల నాగరాజు మాట్లాడుతూ... రాష్ట్రంలో ఏడాదికి దాదాపు 8వేల మంది రోడ్డు ప్రమాదాల కారణంగా మృతి చెందుతుండగా 25వేల మందికి పైగా గాయపడుతున్నారన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో ఆర్టీసీ బస్సు ప్రమాదాలు చాలా తక్కువని, దీనికి డ్రైవర్లకు ఆర్టీసీ ఇచ్చే శిక్షణే కారణమన్నారు. రోడ్డుభద్రతా నియమాలను తూచా తప్పకుండా పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయన్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో రోజురోజుకీ వాహనాల సంఖ్య పెరుగుతోందని, వాహనాల సంఖ్యతోపాటు ప్రమాదాలు పెరిగే అవకాశముందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అప్రమత్తత వహిస్తే తప్ప ప్రమాదాలను నివారించలేమన్నారు. కార్యక్రమంలో పీఓ చెంద్రాయుడు, డిప్యూటీ సీటీఎం శ్రీలక్ష్మి, అనంతపురం డిపో మేనేజర్ నాగభూపాల్, రీజియన్‌లోని అన్ని డిపోల డీఎంలు, బస్టాండు మేనేజర్ కేఎస్ మూర్తి, ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డులు పొందిన డ్రైవర్లు వీరే...

జోనల్ స్థాయిలో..:	ఎం.ప్రసాద్ (తాడిపత్రి), జీకే మొహిద్దీన్ (అనంతపురం)
రీజియన్ స్థాయిలో.. :	కేవీ రాముడు(తాడిపత్రి), బీఆర్ ఆంజనేయులు(అనంతపురం), జి.వెంకటేష్(కళ్యాణదుర్గం)

డిపోలవారీగా..

డిపో పేరు	డ్రైవర్ పేరు
అనంతపురం	ఎస్ఎం బాషా, జేఎస్ రాములు, కేఐ సాహెబ్
గుత్తి	కె.రాజు, ఎంఆర్ గోపాల్, ఎస్ రహిమాన్
గుంతకల్లు	బి.బాలస్వామి, హెచ్‌కే పీరా, వైకే మూర్తి
కళ్యాణదుర్గం	టీవీ రమణ, ఎస్ఆర్ క్రిష్ణ, బీఎస్ఆర్ రెడ్డి
రాయదుర్గం	వి. శేఖర్, డీజీ నాయక్, పి. రామాంజిని
తాడిపత్రి	డి. మోహన్, పి తిరుపతయ్య, ఎంబీ నారాయణ
ఉరవకొండ	ఎ. వెంకటేశులు, యం.రామదాస్, ఎంసీ రంగస్వామి

భక్తి శ్రద్ధలతో మహాభోగ్

ముగిసిన సేవాలాల్ జయంత్యుత్సవాలు



అలంకరణలో సేవాలాల్ మహరాజ్



ఎంపీ అంబికా, కలెక్టర్‌ను సన్మానిస్తున్న ట్రస్టు సభ్యులు



మహాభోగ్ కార్యక్రమం నిర్వహిస్తూ..

గుత్తి రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సేవాలాల్ జయంత్యుత్సవాలు శనివారం ముగిశాయి. స్వామివారికి శనివారం వేకువజామున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకిలో కొలువుదీర్చి ఊరేగించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన సేవాలాల్ మాలధారులు ఇరుముడులను సమర్పించారు. మాతాజగదాంబ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయం నుంచి 101 మంది యువతులు బోనాలను తీసుకువెళ్లి సేవాలాల్ మహరాజ్‌కు సమర్పించారు. పీఠాధిపతి రాజేంద్ర ప్రసాద్ గురూజీ నేతృత్వంలో ముగింపు ఉత్సవాల్లో అత్యంత కీలకమైన మహాభోగ్‌ను బంజారాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ చివరి రోజు వేడుకలలో పాల్గొన్నారు. ఉత్సవాలను విజయవంతం చేసిన అధికారులను అభినందించారు. సేవాలాల్ మహరాజ్‌కి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు, ఉపాధ్యక్షులు కేశవనాయక్, రవీంద్ర నాయక్, సభ్యులు అశ్వత్థనాయక్, ఎకే రామచంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఇరుముడి తీసుకెళుతున్న మాలధారులు

ఆడుతాం.. పాడుతాం..!

బాలోత్సవాలలో అదే ఉత్సాహం

ఆహూతులను కట్టిపడేసిన ప్రదర్శనలు



మాయమైపోలేదు.. జానపదం..





ఉత్తమం.. ఉమ్మడి కుటుంబం

వెయ్.. చిందెయ్..



రెండు కళ్లనూ కట్టిపడేసేలా...







పోలా.. అదిరిపోలా..



అమ్మోరు తల్లో....









బాలోత్సవాలలో రెండో రోజు అదే ఉత్సాహం కొనసాగింది. లలితకళా పరిషత్, గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్ ప్రాంగణాలలో వందలాది మంది బాలలు శనివారం రెండో రోజు ఆటపాటలతో అలరించారు. అలుపు సొలుపు లేకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు పోటాపోటీగా నృత్య, నాటక ప్రదర్శనలు ఇచ్చారు. ఏకపాత్రాభినయాలు, షార్ట్‌ఫిల్మ్ విశ్లేషణలు ఆలోచింపజేశాయి. వ్యాస రచన, మ్యాప్, వక్తృత్వ, క్విజ్ పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉత్సవాలను తిలకించేందుకు నగరవాసులు తరలివచ్చారు. ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు షమీమ్ షఫివుల్లా అధ్యక్షతన కెనరాబ్యాంకు రీజనల్ ఏజీయం లారెన్స్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతిభ చాటిన బాలలకు అతిథులు బహుమతులను అందజేశారు. వేడుకలలో పాల్గొన్న సుమారు 2,500 మందికి హెచ్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత హెచ్ హనుమంతరెడ్డి భోజనం సమకూర్చారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు రాంభూపాల్, జిల్లా కార్యదర్శి నల్లప్ప, బాలోత్సవ కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి ఐద్వా సావిత్రితో ఆయన చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు భోజనం వడ్డించారు. చిన్నారులకు ఆనందాన్ని కలిగించే ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించాలని, తమవంతు సహకారం అందిస్తామని హనుమంతరెడ్డి అన్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్, క్లాక్ టవర్



రంగు రంగుల వేషధారణలు..



భోజనం వడ్డిస్తున్న హెచ్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత హనుమంతరెడ్డి, సీపీఎం రాష్ట్ర నాయకుడు రాంభూపాల్, జిల్లా కార్యదర్శి నల్లప్ప తదితరులు





పాత్ర ఏదైనా.. జీవించేస్తాం..

దానిమ్మ రైతుకు ధరల పంట..!



రూ.1.40 లక్షల వరకు పలుకుతున్న టన్ను

తోటల వద్దే కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

అన్నదాతల్లో ఆనందం



మర్తాడులో సాగుచేసిన దానిమ్మ తోట

దానిమ్మ రైతు ఇంట ధరల పంట పండింది. అనూహ్య ధరలతో అన్నదాతపై సిరుల వర్షం కురుస్తోంది. టన్ను ఏకంగా రూ.1.40 లక్షల వరకు ధర పలుకుతుండడంతో రైతులు లక్షాధికారులవుతున్నారు. తోటల వద్దకే వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తుండడంతో అన్నదాతల ఆనందానికి అవధుల్లేవు. అప్పుల నుంచి బయటపడతామని సంబర పడుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, గార్లదిన్నె

కష్టాలు తీరినట్లే



ప్రస్తుతం టన్ను దానిమ్మ రూ.1.40 లక్షల వరకు ధర పలుకుతోంది. ఇది ఇలాగే ఉంటే రైతుల కష్టాలు తీరి నట్లే. ఏడెకరాల్లో దానిమ్మ సాగుచేశా. ఎకరాకు రూ.60వేల వరకు పెట్టుబడి పెట్టా. గతేడాది పెద్దగా ధర లేదు. ఈసారి ఆశించిన స్థాయిలో దిగుబడి రావడంతోపాటు గిట్టుబాటు ధర కూడా దక్కుతోంది. విజయవాడ, చెన్నై ప్రాంతాలకు చెందిన వ్యాపారులు.. తోటల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. 40 టన్నుల వరకు దిగుబడి వచ్చింది. తోటలోనే టన్ను రూ.1.40 లక్షలకు అమ్మేశా.

- ఆవుల రామకృష్ణ, రైతు, మర్తాడు

పెరిగిన దానిమ్మ సాగు



మర్తాడులో కోసిన దానిమ్మ పండ్లు

గార్లదిన్నె అంటేనే టక్కున గుర్తుకొచ్చేది చీనీ సాగు. రాష్ట్రంలోనే చీనీ సాగుకు మండలం ప్రత్యేక గుర్తింపు పొందింది. మండల రైతులు మాత్రం రెండేళ్లుగా దానిమ్మ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. గార్లదిన్నె, మర్తాడు, ముకుందాపురం, యర్రగుంట్ల, జంబులదిన్నె, తిమ్మంపేట, కొప్పలకొండ తదితర గ్రామాల్లో రైతులు దానిమ్మ పంట పెడుతున్నారు. మండలవ్యాప్తంగా సుమారు 500 ఎకరాల్లో సాగు చేశారు. ఇందులో సగానికి పైగా పంట దిగుబడి వస్తున్నట్లు తెలుస్తోంది. పదిరోజుల క్రితం వరకు టన్ను రూ.80వేల నుంచి రూ.90వేల వరకు ధర ఉండేది. ప్రస్తుతం ఆ ధర మరింత పెరిగింది. ప్రస్తుతం టన్ను రూ.1.40 లక్షల వరకు పలుకుతోంది.

తోటల వద్దకే వ్యాపారులు..

గతంలో దిగుబడులు ఆశాజనకంగా వచ్చినా ధరలు లేకపోవడంతో పంటను విక్రయించుకోవడానికి రైతులు ఇబ్బందులు పడేవారు. వ్యాపారుల వద్దకు వెళ్లేవారు. దీంతో రైతులకు మార్కెటింగ్, రవాణా ఖర్చులు తడిసి మోపెడయ్యేవి. ప్రస్తుతం మార్కెట్‌లో దానిమ్మకు ధర ఉండడంతో వ్యాపారులే.. రైతుల వద్దకు వస్తున్నారు. కాయలు నాణ్యతగా, సైజు బాగా ఉంటే రైతుల పంట పండినట్లే. రాజస్థాన్, మహారాష్ట్ర, కర్ణాటక, కోయంబత్తూరు తదితర ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో దానిమ్మ దిగుబడి తగ్గిపోయింది. జిల్లాలో ఈ ఏడాది దానిమ్మకు వైరస్ సోకలేదు. అక్కడక్కడా సోకినా రైతులు కాపాడుకున్నారు. మేలైన దిగుబడులు సాధించారు. ధర కూడా ఆశాజనకంగా ఉంది. ధరలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక్కడ పండే దానిమ్మ విజయవాడతోపాటు చెన్నై, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు.



వ్యాపారులే వస్తున్నారు

ప్రస్తుతం దానిమ్మ సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. దానిమ్మ చెట్లకు ఎక్కువగా బ్యాక్టీరియా సోకుతుంది. కంటికి రెప్పలా కాపాడుకోవాలి. గతంలో పంటను విక్రయించేందుకు చాలా ఇబ్బందులు పడేవారం. ప్రస్తుతం డిమాండ్ ఉండడంతో వ్యాపారులే తోటల వద్దకు వస్తున్నారు.

- తిరుపతిరెడ్డి, గార్లదిన్నె

ధర నేలచూపు.. ధాన్యం గోదాము వైపు..!

- పప్పుశనగకు దక్కని గిట్టుబాటు రేటు
- నష్టానికి అమ్ముకోలేకపోతున్న అన్నదాత
- ధాన్యమంతా గోదాములకు తరలిస్తున్న దుస్థితి



తగ్గుపర్తిలో పప్పుశనగను గ్రేడింగ్ చేసి తరలించేందుకు సిద్ధం చేస్తున్న రైతులు

పప్పుశనగ ధర నేలచూపులు చూస్తోంది. తక్కువ ధరకు అమ్ముకోలేక అన్నదాతలు దిక్కులు చూస్తున్నారు. క్వింటా పప్పుశనగ ధర రూ.6 వేల లోపే పలుకుతోంది. చేసేదిలేక రైతులు పండించిన పంట అంతా గోదాములకు తరలిస్తున్నారు. అప్పులు చేసి.. రైతులు పెట్టుబడులు పెట్టారు. పంట పండినా అమ్ముకోలేని పరిస్థితి దాపురించింది. దీంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

బెళుగుప్ప, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లరేగడి భూముల రైతులకు పప్పుశనగ పంట జీవనాధారం. మండలవ్యాప్తంగా రబీలో 16,600 ఎకరాల్లో పప్పుశనగ సాగు చేశారు. ఎకరాకు రూ.16వేల వరకు పెట్టుబడి పెట్టారు. తెగుళ్ల నివారణకు అధిక మొత్తంలో ఖర్చు చేశారు. దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయి. ఎకరాకు ఐదారు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కష్టాల నుంచి కొంతమేర ఉపశమనం లభిస్తుందని అన్నదాతలు ఆశించారు. వారికి ధరల విపత్తు ఎదురైంది. ఈసారి ధరలు పాతాళానికి పడిపోయాయి. క్వింటా రూ.6వేలు కూడా పలకట్లేదు. ఆ ధరకు విక్రయిస్తే గిట్టుబాటు కాదని అన్నదాతలు వాపోతున్నారు. ఇళ్లలో నిల్వ ఉంచుకుంటే పురుగు పడుతోంది. చేసేదిలేక రైతులు అద్దెలు చెల్లించి, గోదాముల్లో నిల్వ చేసుకుంటున్నారు. ధర పెరిగితేనే గట్టెక్కుతామనీ, అప్పటివరకు ఎదురుచూపులు తప్పవని అన్నదాతలు అంటున్నారు.

ఏడాదికేడాదికీ తగ్గుముఖం

పప్పుశనగ ధరలు తగ్గుతూ వస్తున్నాయి. మూడేళ్ల క్రితం క్వింటా పప్పుశనగ ధర రూ.పదివేలు పలికింది. గతేడాది రూ.8 వేలకు తగ్గింది. ప్రస్తుతం రూ.ఆరువేల లోపే పలుకుతోంది. ఈ ఏడాది కాస్తో.. కూస్తో.. దిగుబడి వచ్చినా ధర లేదు. ఏటా ధరలు తగ్గుముఖం పడుతుండటంతో కోలుకోలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే పప్పుశనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



గోదాములోకి చేర్చుతున్న హమాలీలు.. నిల్వ ఉంచిన పప్పుశనగ

గిట్టుబాటు ధర వస్తేనే గట్టెక్కగలం



30 ఎకరాల్లో పప్పుశనగ సాగు చేశా. రూ.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. 150 క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చింది. కష్టాలు తీరతాయనుకున్నా. ధరల్లేక అల్లాడుతున్నాం. గోదాము అద్దె భారమైనా తప్పని పరిస్థితుల్లో అందులో నిల్వ చేస్తున్నాం. క్వింటా రూ.8 వేలు ధర పలికితేనే గట్టెక్కగలం.

- కిష్టయ్య, రైతు, తగ్గుపర్తి

రూ.8 వేలతో కొన్నాం.. రూ.5,500తో విక్రయం



40 ఎకరాల్లో పప్పుశనగ సాగు చేశా. 200 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. విక్రయిద్దామంటే ధరల్లేవు. పంట సాగు సమయంలో పప్పుశనగ విత్తనాన్ని రూ.8 వేలతో కొనుగోలు చేశాం. ఇప్పుడేమో రూ.5500లోపే ధర ఉంది. ఈ ధరకు విక్రయించుకోలేక గోదాములో నిల్వ ఉంచాం.

- రుద్రయ్య, రైతు, ఎర్రగుడి

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం


పప్పుశనగ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

- పృథ్వీసాగర్, ఏఓ, బెళుగుప్ప

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంపు...

దాదాసాహెబ్ ఫాల్కే (వర్ధంతి)



భారతీయ సినీ పితామహగా పేరొందిన దాదాసాహెబ్ ఫాల్కే 1870 ఏప్రిల్ 30న మహారాష్ట్ర సమీపాన త్రయంబకేశ్వర్‌లో జన్మించారు. అసలు పేరు ధుండిరాజ్ గోవింద్ ఫాల్కే. కళాత్మక అభిరుచి కారణంగా జేజే స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చిత్రలేఖనం నేర్చుకున్నారు. బరోడాలోని కళాభవన్‌లో ఫోటోగ్రఫీ, మౌల్డింగ్, ఆర్కిటెక్చర్ వంటి అనేక కళలతోపాటు మ్యాజిక్ కూడా నేర్చుకున్నారు. లఘుచిత్ర నిర్మాత నుంచి దర్శకుడిగా, నిర్మాతగా ఎదిగారు. ఎన్నో ఒడిదుడుకులను అధిగమించి 1913లో రాజా హరిశ్చంద్ర సినిమాను రూపొం దించారు. ఆ తర్వాత 19 ఏళ్లలో 95 ఫీచర్ ఫిల్మ్‌లు, 27 షార్ట్ ఫిల్మ్‌లు రూపొందించారు. మోహినీ భస్మాసుర, సావిత్రి సత్యవాన్, లంకా దహన్, శ్రీకృష్ణ జన్మ, కాళీయ మర్దన్ తదితర సినిమాలు ఎంతో గుర్తింపు పొందాయి. సినిమా రంగంలో ఆయన అం దించిన అద్వితీయమైన సేవలకుగాను కేంద్ర ప్రభు త్వం ఆయన గౌరవార్థం 'దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు' ఇస్తోంది. 1944 ఫిబ్రవరి 16న కన్ను మూశారు.

నార్ల వెంకటేశ్వరరావు (వర్ధంతి)



వీఆర్ నార్లగా సుపరిచితులైన నార్ల వెంకటేశ్వరరావు 1908 డిసెంబరు 1న మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్‌లో జన్మించారు. తెలుగునాట ప్రముఖ పాత్రికేయుడు, రచయిత. ఆంధ్రజ్యోతి పత్రికకు చాలాకాలం సంపాదకులుగా పనిచేశారు. పత్రికా రచనలేకాక పలు నాటకాలు, కవితలు, కొన్ని కథలు రాశారు. హేతువాదిగా, మానవతావాదిగా జీవించారు. ఎడిటర్‌గా పనిచేసిన 37ఏళ్ల కాలంలో మూఢ నమ్మకాలపై రాజీలేనిపోరు సాగించారు. ఆయన రచనలు అన్నీ కూర్చి ఇటీవలే 'నార్ల రచనలు' పేరిట పలుభాగాలుగా వెలువరించారు. 1985 ఫిబ్రవరి 16న కన్నుమూశారు.

ఘనంగా తాలూకా కన్నడ సాహిత్య సమ్మేళనం

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట పట్టణంలో పదో కన్నడ సాహిత్య సమ్మేళనం ఘనంగా జరిగింది. సమ్మేళనాధ్యక్షులుగా రూపసి రమేశ్ వ్యవహరించగా పలు చర్చాగోష్టులు, వివిధ రంగాల సాధకులను సత్కరించారు. వాసవి పాఠశాల ఆవరణలో శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు పలు కార్యక్రమాలు కొనసాగాయి. సమ్మేళనాధ్యక్షుడు రూపసి రమేశ్ మాట్లాడుతూ ఇంటినుంచే కన్నడ భాష నేర్చుకోవడం, వాడకం పెరగాలన్నారు. అలాగే ఇతర భాషలను గౌరవించాలన్నారు. ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో జన్మించిన ప్రతి ఒక్కరూ కన్నడపై అభిమానం పెంచుకుని సాగాలన్నారు. ఇలాంటి సమ్మేళనాలు అర్థవంతంగా ఏటా కొనసాగాలని అభిప్రాయపడ్డారు. అలాగే మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. డాక్టర్ రాజ్‌కుమార్ పాడిన పాటలను ప్రస్తావిస్తూ నేల, నీరు, భాషపై స్వాభిమానం కలిగి ఉండాలన్నారు. గుడిబండకు చెందిన ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాల ప్రాధ్యాపకులు డాక్టర్ నయాజ్ అహ్మద్ ప్రధాన ప్రసంగం చేస్తూ కన్నడ మాత భువనేశ్వరి గురించి తెలుసుకోవాలని, ప్రపంచం మెచ్చేలాంటి సర్ ఎం విశ్వేశ్వరయ్య, మైసూరు రాజు నాల్వడి కృష్ణరాజ ఒడెయార్‌ల భావచిత్రాలను



వేదికపై వివిధరంగాల సాధకులకు సన్మానం

ఆవిష్కరించారు. వివిధరంగాల సాధకులను ఇదే సందర్భంగా సత్కరించారు. రిటైర్డు టీచర్ శ్యామసుందర్ రచించిన శ్యామలహరి కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. తాజా మాజీ అధ్యక్షుడు సంతె నారాయణస్వామి ప్రస్తుత అధ్యక్షుడు రూపసి రమేశ్‌కు కన్నడ పరిషత్ ధ్వజాన్ని అందచేశారు. తొలుత సమ్మేళనాధ్యక్షులు, కన్నడ మాత భువనేశ్వరిదేవిలను పురవీధులలో ఊరేగించారు. కార్యక్రమంలో తహసీల్దారు బీఎన్ స్వామి, ఈఓ హేమావతి, బీఈఓ నరేంద్రకుమార్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సుబ్బారెడ్డి, బీజేపీ ప్రముఖుడు సీకల్ ఆనందగౌడ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై మంత్రి ఆగ్రహం



భూమిపూజలో మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ తదితరులు

చింతామణి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ఎమ్మెల్యే, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ నేతృత్వంలో పలు అభి వృద్ధి పనుల భూమిపూజ కార్యక్రమాలలు పలు వురు అధికారులు గైర్హాజరు కావడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుద్ధతాగునీటి విభాగం నిర్మాణ పనులు నాసిరకంగా ఉండడాన్ని తప్పుబట్టారు. శనివారం ఉదయం చింతామణి తాలూకాలో సుమారు 6 కోట్ల రూపాయల పలు అభి వృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపన కార్యక్రమాలను శెట్టిహళ్ళి గ్రామంలో ప్రారంభిం చారు. పెద్దూరు రోడ్డు నుంచి అన్నేహళ్ళికి వెళ్లే మార్గం అభివృద్ధి పనులకు భూమిపూజకు విచ్చేయగా సంబంధిత అధికారులు కనిపించలేదు. తాలూకా పంచాయతీ ఈఓ ఎస్ ఆనంద్, పీడీఓలు మినహా మిగిలినవారు హాజరు కాకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధి కారులకు ఫోన్ చేసి గ్రామస్థుల సమస్యలకు ఏమని సమాధానం ఇవ్వాలని ప్రశ్నించారు. తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 2023-24లో ముఖ్యమంత్రి ప్రత్యేక గ్రాంట్లు రూ.25 కోట్లు చింతామణి నియో జకవర్గానికి కేటాయించగా అందులో మురగ మల్లా హోబళికి రూ.5కోట్లు కేటాయించా మన్నారు. తొలుత గ్రామంలో నిర్మిం చిన శుద్ధతాగు నీటి కేంద్రా న్ని లాంచ నంగా ప్రారంభించారు. అక్కడ పనులు నాసిర కంగా ఉండడాన్ని గమ నించి ప్రజాపనుల శాఖ అధికారి లోకేశ్, కాంట్రాక్టర్ నందీశ్‌లపై మండి పడ్డారు. ప్రభుత్వ నిర్మాణాలలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. అనంతరం మురుగమల్లె గ్రామంలోని

రోడ్ల పనులకు చర్యలు

కొన్నేళ్లుగా దుస్థితిలో ఉన్న మురగ మల్లా హోబళి శ్రీనివాసపుర సరిహద్దు నుంచి దిగువకోటె మీదుగా యగవకోటె రోడ్డువరకు రూ.3.5కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. పలు గ్రామాలలో తాలూకా, జిల్లా పంచా యతీలకు సంబంధించిన పథకాలతో శుద్ధ తాగునీటి కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కొన్ని గ్రామాలలో జిల్లా మైనింగ్ ఫండ్ కింద రూ.కోటితో 13 గ్రామాలకు మంజూరు చేసిన శుద్ధతాగునీటి కేంద్రాలను ప్రస్తుతం ప్రారంభించా మన్నారు. కాగా చిన్ననీటిపారుదలశాఖ నుంచి రూ.60లక్షలతో ముద్దలహళ్ళి గ్రామ సమీపాన చెక్‌డ్యాం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్నట్టు తెలిపారు. ఇలా పలు పథకాలకింద పలు రకాల అభివృద్ధి పనులు చేపడుతుండగా నిర్మాణాలలో నాణ్యతలో రాజీ పడేది లేదని, ఉపేక్షిస్తే సహిం చేది లేదన్నారు. కార్యక్రమాలలో పెద్దూర గ్రామ పంచాయతీ అధ్యక్షుడు యర్రప్పరెడ్డి, మురగ మల్లా గ్రామపంచాయతీ అధ్యక్షుడు హాజి అన్సర్ ఖాన్, ఏపీఎంసీ మాజీ అధ్యక్షుడు గంగ్రగాన హళ్ళి శ్రీరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి ఇళ్లు మంజూరు

● ఎంపీ తుకారామ్



గౌతమ్‌నగర్‌లో స్థలాన్ని పరిశీలించిన ఎంపీ తుకారామ్, కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

కంప్లి, ఫిబ్రవరి 15(ఆంధ్ర జ్యోతి): జిల్లా పరిధిలోని కుడితిని పట్టణంలోని పేదలకు వెయ్యి ఇళ్లు మంజూరైనట్లు ఎంపీ తుకారామ్ తెలిపారు. ఇళ్ల నిర్మాణం కోసం శనివారం గౌతమ్‌నగర్‌ను ఎంపీ, జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ విలేకరులతో మాట్లాడుతూ నూతన పట్టణ పంచాయతీకు రూ. 200 కోట్లతో తాగునీటి సౌకర్యం, పైపులైన్లు, ఏర్పాటు చేసి తాగునీటి సమస్య లేకుండా చేస్తాం. అలాగే రూ. 6.30 కోట్లతో ఇందిరానగర్ నుండి హోస్పేట బైపాస్ వరకు మిగిలి వున్న పనులను కూడా పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. అలాగే 30 పడకల ఆస్పత్రి, ఇతర అభివృద్ధి పనులు కుడితినిలో చేపట్టి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చేపడతామన్నారు. ఇప్పటికే కుడితిని పట్టణంలో ప్రధాన రోడ్డులో డివైడర్లు, రోడ్ల విస్తరణ చేపట్టి సుందరంగా తీర్చిదిద్దాము. నూతన పట్టణ పంచాయతీకు కూడా నిధులు మంజూరు చేస్తామన్నారు. వేసవి కాలం ప్రారంభమవుతుంది. ప్రతి వార్డులో తాగునీటి సమస్య, విద్యుత్‌లైట్లు, ఇతర సమస్యలు తలెత్తకుండా చూడాలని ముఖ్య అధికారులకు సూచించారు. పట్టణ ముఖద్వారం కోసం రూ. 50 లక్షలు నిధులు మంజూరు చేశామన్నారు. మనస్పర్థలు వదిలి పట్టణ అభివృద్ధికి ముందుకు రావాలని సూచించారు. వారితో పాటు పట్టణ పంచాయతీ అధ్యక్షులు బసమ్మ, చంద్రప్ప, కనికేరి పంపాపతి, స్థాయి సమితి అధ్యక్షులు రాజశేఖర్, ముఖ్య అధికారి తీర్థ ప్రసాద్, తహసీల్దార్ గురురాజు, చంద్రయ్య దొడ్డబసప్ప, దొడ్డప్ప, శివలింగప్ప, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కల్యాణ కర్ణాటక అభివృద్ధికి కృషి

● కేకేఆర్‌డీబీ చైర్మన్ అజయ్‌సింగ్



విలేకరులతో మాట్లాడుతున్న అజయ్‌సింగ్

రాయచూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కల్యాణ కర్ణాటక ప్రాంతం అభివృద్ధికి ప్రభుత్వం నిబద్ధతతో కృషి చేస్తున్నట్లు కేకేఆర్‌డీబీ చైర్మన్ అజయ్‌సింగ్ తెలిపారు. శనివారం నగరంలోని వ్యవసాయ విశ్వ విద్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడిన ఆయన గతానికి భిన్నంగా ఈ ఏడాది కేకేఆర్‌డీబీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేల కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. ఈ నిధుల్లో ఇప్పటికే రూ.2009 కోట్లు వ్యయం చేసి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరాన్ని విద్య ఆరోగ్య సంవత్సరాలుగా ప్రకటించిన నేపథ్యంలో విద్య అభివృద్ధి కోసం 857 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఆస్పత్రుల అభివృద్ధి కోసం రూ.850 కోట్లు కేటాయించామన్నారు. ఇప్పటికే రూ.400 కోట్లు విలువ చేసే పనులు అభివృద్ధిలో ఉండగా మిగతా పనులను ఏడాదిలోగా పూర్తి చేసేందుకు అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చామన్నారు. గతంలో కల్యాణ-కర్ణాటక అభివృద్ధి కోసం విడుదలైన నిధులు ఖర్చు కాకుండా మిగిలాయన్న అపవాదను కాంగ్రెస్ ప్రభుత్వం తిరగరాసిందన్నారు. ఇప్పటికే నిధుల్లో 60 శాతం ఖర్చు చేసి పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు అజయ్ సింగ్ వివరించారు.

శేషా చలపతి ఎందరికో స్ఫూర్తి



మెడల్స్‌తో శేషా చలపతి

బెంగళూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): క్రీడలు, సామాజిక సేవ ద్వారా నిత్యం క్రియాశీలకంగా ఉండవచ్చునని శేషచలపతి నిరూపిస్తున్నారు. 75ఏళ్ల వయస్సులోనూ సైక్లింగ్, స్విమ్మింగ్, మారథాన్, బ్యాడ్మింటన్ క్రీడల్లో రాణిస్తున్నారు. ఈనెల 4న రథసప్తమి సంద ర్భంగా మహాలక్ష్మీలే అవుట్‌లోని ప్రసన్న వీరాం జనేయ యోగాకేంద్రం ఆధ్వర్యంలో 1009 సూర్యనమస్కారాలు వేయడం ద్వారా ఓ సరికొత్త రికార్డును నెలకొల్పారు. ఉదయం 4.30గంటల నుంచి సాయంత్రం 7.30 గంటలదాకా సూర్య నమస్కారాలు చేశారు. ఆయన స్ఫూర్తితో వీరాంజనేయ యోగా కేంద్రంలో ఎంతోమంది యువత సూర్యనమస్కారాలు చేశారు. 2024 నవంబరులో తమిళనాడులోని సేలంలో జరిగిన సీనియర్ బ్యాడ్మింటన్ పోటీల్లో డబుల్స్ అండ్ లక్కీ డబుల్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచి సిల్వర్ మెడల్‌ను సాధించారు. ఇటీవల జనవరిలో చెన్నైలో జరిగిన ఆలిండియా మాస్టర్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ చాంపియన్‌షిప్ 2025లో పవర్‌యోగా విభాగంలో కాంస్యం పతకాన్ని సాధించారు. 5కిలోమీటర్ల స్ప్రింట్‌లో బంగారు బహుమతిని, 50 కిలోమీటర్ల సైక్లింగ్‌లో విజేతగా నిలిచారు. యలహంకలోని ప్రకాశ్ పడుకొనె అకాడమీలో టి-గోల్ఫ్ పోటీలకు ముఖ్యులుగా పాల్గొంటుంటారు. 2018లో గోవాలో జరిగిన నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ విజేతగాను, కొచ్చిలో 2019లో బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భాగస్వామ్యులయ్యారు. వయస్సుతో సంబంధం లేకుండా వివిధ క్రీడల్లో రాణిస్తూ యువ విద్యార్థులు, క్రీడాకారులకు స్ఫూర్తినిస్తున్నారు. క్రీడల్లో అనుభవాన్ని యువతకు నైపుణ్యత ఇచ్చేలా వ్యవహరిస్తున్నారు. ఫిట్‌నెస్‌తోనే ఆరోగ్యం సాధ్యమని నిరంతరంగా శేష చలపతి ప్రచారం చేస్తున్నారు. బెంగళూరులో ఏటా జరిగే టీసీఎస్ వరల్డ్ 10కే మారథాన్ లో ఏటా భాగస్వామ్యులు కావడమే కాక 10కిలోమీటర్లను పూర్తి చేస్తుంటారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగంలో బంగారు పతకాన్ని సాధించిన శేషచలపతి, కంప్యూటర్ ఎలక్ట్రానిక్స్‌లో ఇంజనీరింగ్ చేశారు. వివిధ కోచింగ్ కేంద్రాలలో పనిచేశారు. మినిస్ట్రీ ఆఫ్ కమ్యూనికేషన్ విభాగంలో బెంగళూరు, హైదరాబాద్‌లలోనూ, వియోనెక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో మైసూరు, దుబాయ్‌లలో పదేళ్లపాటు సేవలం దించారు. ఆరేళ్లపాటు సాఫ్ట్‌వేర్ విభాగంలో ఇఆర్‌పి, ఎస్ఏపి విభాగంలో నైపుణ్యతో బోధించారు. వివిధ హోదాలలో కొనసాగిన ఆయన రిటైర్డు తర్వాత క్రీడలు, సామాజికసేవకు ప్రాధాన్యత ఇస్తున్నారు.



జ్ఞాపిక అందుకుంటున్న శేషచలపతి

ఉచితంగా బోధనలు : బెంగళూరులో నివసిస్తున్నా పొరుగున ఉండే అనంతపురం జిల్లాలోని పుట్టపర్తిలో హైస్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులకు, బెంగళూరులోని రాజాజినగర్ సాయిస్కూల్స్, బసవేశ్వరనగర్‌లోని బీడీ జట్టి హైస్కూల్ విద్యార్థులకు మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులలో ఉచితంగా బోధనలు చేస్తుంటారు. పదేళ్లుగా క్రీడల్లో కొనసాగుతూ ఎనిమిదేళ్లుగా ప్రభుత్వ హైస్కూల్‌లో ఉచిత బోధనలు చేస్తున్నారు. యువత, వృద్ధులు అనే తేడా లేకుండా అందుబాటులో ఉన్న సౌకర్యాలను సౌలభ్యాలుగా మార్చుకుని నిత్యం వ్యాయామం, యోగా వంటి వాటిల్లో పాల్గొనాలని తద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో జీవనం సాధ్యమని శేషచలపతి అభిప్రాయపడ్డారు.

చిన్నారుల ప్రతిభను ప్రోత్సహించాలి

బాగేపల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): చిన్నారులలో దాగియున్న ప్రతిభను వెలికితీసేందుకు వీలుగా పాఠశాల వార్షికోత్సవం వంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని గౌరిబిదనూరు తాలూకా అధ్యాపకులు కేవీ ప్రకాశ్ అభిప్రాయపడ్డారు. బాగేపల్లి పట్టణంలోని ద్వారకా పార్టీహాల్‌లో ఏర్పాటైన హలో కిడ్స్ పాఠశాల వార్షికోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. చిన్నారుల ప్రతిభను ప్రోత్సహించే బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉంటుందని అందుకు వారి సహకారం అవసరమన్నారు. పురసభ ఉపాధ్యక్షురాలు సుజాత నరసింహనాయుడు మాట్లాడుతూ ఇంట్లో పిల్లలు చదివేందుకు వీలుగా తగిన వాతావరణం కల్పించాలని, టీవీలు, మొబైల్‌లకు బానిస కారాదన్నారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు సభికులను అలరించాయి.



వేదికపై చిన్నారులతో తల్లులు తదితరులు

కార్యక్రమంలో పాఠశాల ముఖ్యులు, ట్రస్టీలు వైజి కుశల, ప్రధానోపాధ్యాయురాలు శోభా, నేషనల్ పీయూ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాణిగ సంఘం బలోపేతానికి కృషి



సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు

ముళబాగిలు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అఖిల కర్ణాటక జ్యోతినగర్ వైశ్యగాణిగ సంఘాన్ని బలోపేతం చేయడానికి కృషి చేయాలని సంఘం రాష్ట్ర ప్రముఖ నేత జీ వేణుగోపాల్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని కురుడుమలె వినాయక దేవాలయ ఆవరణలో గాణిగ సంఘం సభ్యత్వ నమోదు, కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. సామాజికవర్గానికి చెందిన పిల్లలకు ఉత్తమ విద్య కోసం, ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహించేందుకు సంఘం కృషి చేస్తోందన్నారు. సంఘం సమగ్ర అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. జడ్పీ మాజీ సభ్యుడు అమరనాథ్ మాట్లాడుతూ జ్యోతినగర్ గాణిగసంఘం బలోపేతం చేయడం ద్వారా ప్రభుత్వ సౌలభ్యాలు పొందడమే లక్ష్యమన్నారు. భిన్నాభిప్రాయాలు ఏమైనా ఉంటే పక్కనపెట్టి ముందుకు సాగాలన్నారు. ఉన్నత విద్యకు ఇస్తున్న ఆర్థికసాయాన్ని ఇకపై కూడా కొనసాగిస్తామన్నారు. ఎస్ఎల్ఎన్ ధర్మసంస్థ మాజీ అధ్యక్షుడు బీజీ రమేశ్, మోహన్ మూర్తిలు ప్రసంగించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీజీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ తొలివిడతలో 5వేల మంది సభ్యత్వ నమోదు భావించామన్నారు. రానున్న రోజుల్లో ప్రతి తాలూకా, జిల్లా స్థాయిలో సంఘం శాఖలు ఏర్పాటు చేస్తామన్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు టీఎస్ రమేశ్, ఎస్‌డీసీ కాలేజ్ ప్రిన్సిపాల్ మురళికృష్ణ, సంఘం కోశాధికారి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ పరిశ్రమను ప్రోత్సహించాలి

» స్టోనాలో అరుణ్‌యోగిరాజ్‌కు సన్మానం

బెంగళూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): భవనాలను అందంగా తీర్చే గ్రానైట్ పరిశ్రమను ప్రభుత్వం ప్రోత్సహించాలని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ గ్రానైట్ అండ్ స్టోన్ ఇండస్ట్రీ అధ్యక్షుడు కృష్ణప్రసాద్ అభిప్రాయపడ్డారు. స్టోనా 2025 ప్రదర్శనల ముగింపు శనివారం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ దశాబ్దాలకాలంగా స్టోనా ప్రదర్శనలు సాగుతున్నాయని ఏటా ఆధునికతతోపాటు రాతిద్వారా అందమైన డిజైన్ల రూపకల్పన సాధ్యమవుతోందన్నారు. ప్రదర్శనలో 18దేశాల ఎగ్జిబిటర్స్, పరికరాల కంపెనీలు భాగస్వామ్యులు అయ్యారన్నారు. నాలుగు రోజుల్లో 30వేలమంది స్టోనా ప్రదర్శనను తిలకించారన్నారు. అయోధ్య రామమందిరంలో బాలరాముడి విగ్రహాన్ని రూపొందించి మైసూరుకు చెందిన అరుణ్ యోగిరాజ్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా అరుణ్ యోగిరాజ్ మాట్లాడుతూ ఒకరాయిని శిల్పంగా మార్చవచ్చునని అయితే ఎన్నో సంస్థల సత్కారం కంటే గ్రానైట్ పరిశ్రమ సత్కారం చేయడాన్ని సంతోషంగా భావిస్తున్నా అన్నారు. ప్రకృతిలో లభించే రాయి ద్వారా శిల్పాలను రూపొందించడం అంటే మన సంస్కృతి పరంపరను సంరక్షించడం అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ గ్రానైట్ అండ్ స్టోన్ ఇండస్ట్రీ ప్రతినిధులతోపాటు స్టోనా ప్రదర్శన నిర్వాహకులు భాగస్వామ్యులు అయ్యారు.



శిల్పి అరుణ్ యోగిరాజ్‌ను సత్కరిస్తున్న ప్రముఖులు

చెరువు అభివృద్ధికి చర్యలు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని గంజిగుంటె పరిధిలోని జీ కురుబరహళ్ళి పరిధిలోని కదరిపత్తిన చెరువులో పూడికతీత పనులను ధర్మస్థళ గ్రామాభివృద్ధి సంస్థ చర్యలు చేపట్టింది. సంఘానికి చెందిన ప్రశాంత్ భూమిపూజ చేపట్టి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంస్థ తాలూకాలో 11ఏళ్లుగా సేవలందిస్తోందన్నారు. ఇప్పటివరకు సంస్థ సామాజికసేవలో రాష్ట్రవ్యాప్తంగా 800 చెరువులను అభివృద్ధి చేసిందన్నారు. శిడ్లఘట్ట తాలూకాలో ఏడో చెరువును కురుబరహళ్ళి పరిధిలోని చెరువును ఎంపిక చేసినట్టు తెలిపారు. నీటి వనరుల సేకరణ ద్వారా పశుపక్ష్యాదులకు తాగునీటికి వీలు కానుందన్నారు. కార్యక్రమంలో బచ్చారెడ్డి, మునియప్ప, చెరువు అభివృద్ధి సమితి అధ్యక్షుడు కేసీ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు త్యాగరాజ, పురంధరదాస ఆరాధన

బెంగళూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పద్మావతి కళానికేతన్ సంస్థ ఆధ్వర్యంలో 45వ సంగీతోత్సవ, త్యాగరాజ, పురంధరదాస ఆరాధన మహోత్సవం నిర్వహిస్తున్నట్టు ఫౌండర్ సెక్రటరీ వేణుగోపాల్ తెలిపారు. సంజయ్‌నగర్‌లోని నాగశెట్టిహళ్ళిలో రమణమహర్షి హెరిటేజ్ బిల్డింగ్‌లో ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు కార్యక్రమాలు ఉంటాయన్నారు. ముఖ్యఅతిథులుగా సంగీతదర్శకులు కుమార భాగవతార్, ఫైన్‌ఆర్ట్స్ కళాశాల వ్యవస్థాపకులు విశ్వనాథ్ ప్రసాద్ పాల్గొంటారన్నారు. పంచరత్న కీర్తనలతోపాటు సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సంగీతాభిమానులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

21నుంచి బీఐఈసీలో మ్యాటిసియా ప్రదర్శనలు

బెంగళూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): దక్షిణభారత స్థాయిలో అతిపెద్ద వాస్తుశిల్ప ఇంటీరియర్స్ (మ్యాటిసియా) ప్రదర్శనలు ఈనెల 21నుంచి బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్ (బీఐఈసీ)లో నిర్వహించనున్నారు. మ్యాటిసియా సదరన్ ఇండియా పేరిట మూడు రోజులపాటు కొనసాగే ప్రదర్శనలు వాస్తుశిల్పి, ఇంటీరియర్స్, సర్ఫేసెస్, ఫర్నీచర్, హార్డ్‌వేర్‌తోపాటు నిర్మాణరంగాలకు అనుబంధమైన బ్రాండ్ కంపెనీలు భాగస్వామ్యం అవుతున్నట్టు మ్యాటిసియా ఎగ్జిబిషన్ డైరెక్టర్ వెర్టికా త్రివేది ప్రకటించారు. మారుతున్న సమాజంలో ఇల్లు, కార్యాలయాలు అందంగా తీర్చుకోవడంతోపాటు వాస్తుకు ప్రాధాన్యత ఇస్తున్నారని క్వాలిటీ పరికరాలకు డిమాండ్ పెరిగిందన్నారు. వీటన్నింటి నేపథ్యంలో ప్రదర్శనల ద్వారా నిర్మాణరంగం ద్వారా ఆధునిక విధానాలు తెలుసుకునేందుకు వీలుగా ప్రదర్శనలు ఉంటాయన్నారు.

రైతునేత కురుబూరు శాంతకుమార్‌కు ఎయిర్ అంబులెన్స్

బెంగళూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెందిన ప్రముఖ రైతు సంఘం నాయకుడు కురుబూరు శాంతకుమార్ పంజాబ్ రాష్ట్రం పటియాల వద్ద గాయపడిన నేపథ్యంలో ఎయిర్ అంబులెన్స్ ద్వారా బెంగళూరుకు తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆదేశాలమేరకు అధికారులు శనివారం తగిన చర్యలు ఏపట్టారు. చండీఘడ్ నుంచి బెంగళూరుకు రప్పించ నున్నారు. నగరంలోని మణిపాల్ ఆసుపత్రిలో చేర్పించదలిచినట్టు తెలు స్తోంది. రోడ్డు ప్రమాదంలో గాయపడిన శాంతకుమార్‌కు వెన్నుకు తీవ్ర గాయాలు కావడంతో పటియాలలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

మహాకుంభమేళాలో ఎమ్మెల్యే

మహదేవపుర, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని ప్రయగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాలో ఎమ్మెల్యే మంజుళా, మాజీ మంత్రి అరవింద లింబావళి దంపతులు పాల్గొన్నారు. శనివారం త్రివేణిసంగమంలో పుణ్యస్నానం చేశారు. శనివారం మాజీ మంత్రి లింబావళి మాట్లాడుతూ 144ఏళ్ల ఒకసారి జరిగే మహాకుంభమేళాలో పాల్గొని పుణ్యస్నానం చేయడం సంతోషంగా ఉందన్నారు.

స్వచ్ఛభారత్ సాధకులకు సన్మానం



పురస్కారాలతో సత్కారం

బెంగళూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ భారత అభియానకు పాటుపడిన విద్యార్థులు, విద్యాసంస్థలు, పొడిచెత్త సేకరిస్తున్న సంస్థలను ఐటీసీ ఓవ్ సంస్థ సత్కరించింది. ఇంటర్‌స్కూల్ రీసైక్లింగ్ చాంపియన్‌షిప్ 2024-25 పోటీల విజేతలను ఐటీసీ ఓవ్ సంస్థ ప్రకటించింది. సుస్థిర సాధనకు కృషి చేసిన వారిని సమాగమ్ పేరిట ఐటీసీ ఓవ్ గ్రీన్ అవార్డ్స్ అందచేశారు. నగరంలోని బీఆర్ అంబేడ్కర్ మైదానంలో ఏర్పాటైన కార్యక్రమంలో ఏడాది పొడవునా ఉత్తమంగా చెత్త నిర్వహణ చేసిన సంస్థలు, విద్యాసంస్థలు, పొడిచెత్త సేకరణదారులు, రెసిడెంట్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్‌లు, సంస్థలకు ఐటీసీ ఓవ్ పురస్కారాలతో సత్కరించారు.

అలరించిన రసమంజరి



వేదికపై మాజీ మంత్రి నారాయణస్వామి తదితరులు

దొమ్మసంద్ర, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకాలోని సర్జాపుర గ్రామంలో చారిత్రాత్మక ప్రసిద్ధి చెందిన కల్యాణ కోదండ రామస్వామి బ్రహ్మరథోత్సవంలో భాగంగా సర్జాపుర బస్టాండ్‌లో కుమార్ మిత్రబృందం ఆధ్వర్యంలో ఏర్పాటైన రసమంజరి సభికులను అల రించింది. శనివారం సాయంత్రంకార్యక్రమాన్ని కేంద్రమాజీ మంత్రి ఏ నారాయణస్వామి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతరలు, బ్రహ్మరథోత్సవాలు అనాది కాలం నుంచి మన పూర్వీకులు దైవ భక్తితో ఆచరిస్తున్నారని వారిబాటలో యువసంఘాలు, ఇతర సంస్థలు కొనసాగిస్తున్నాయన్నారు. ప్రతి వ్యక్తి సమాజం కోసం ఎంతో కొంత పాటుపడాలన్నారు. రసమంజరిలో స్థానికులతోపాటు వివిధ ప్రాంతాల కళాకారులు పాల్గొన్నారు. కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు ఉదయ్‌కుమార్, చింతల మడివాళ కుమార్, ఎస్‌వై అనిల్‌కుమార్, నిర్వాహకులు శ్రీనాథ్ వెంకటస్వామి, హర్షవర్ధన్, ఎస్ మంజునాథ్, ఎస్ఆర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణలో అలరించిన చిన్నారుల నృత్యాలు



ప్రశంసాపత్రం అందజేత

బెంగళూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీకృష్ణ ఇంటర్నేషనల్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో శనివారం యూకేజీ విద్యార్థుల వార్షికోత్సవంలో చిన్నారుల నృత్యాలు అలరించాయి. విద్యాసంస్థల అధ్య క్షులు డాక్టర్ రుక్మాంగద నాయుడు, ఉపాధ్యక్షురాలు జలజానాయుడు పాల్గొన్నారు. బాల్యం నుంచే సంప్రదాయాలు, సంస్కృతి ప్రదర్శనలు, మన చరిత్రను నేర్పాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నారుల యక్షగానం, నాటకాలతోపాటు వివిధ రూపాలలో చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఇగుడూరులో చోరీ

తాడిపత్రి, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇగుడూరు గ్రామంలో శనివారం మధ్యాహ్నం పుష్పావతి ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేసినట్లు ఎస్ఐ కాటయ్య తెలిపారు. ఆయన తెలిపిన మేరకు పుష్పావతి బంధువుల ఫంక్షన్ ఉన్నందున నార్పల మండలం కర్నపాడి గ్రామానికి వెళ్లారు. ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ఇంటిపైనుంచి దుండగులు చొరబడి బీరువాను పగలగొట్టి వాటిలో ఉన్న హుండీలు రెండు ఎత్తుకెళ్లారని వారు తెలిపారు. దాదాపు రూ.1.30లక్షలు ఉంటుందని వారు అంచనా వేశారు. అనంతరం క్లూస్‌టీం రప్పించి ఫింగర్‌ప్రింట్ నమూనాలను సేకరించారు. కేసు నమోదు చేశామని, త్వరలో దొంగను పట్టుకుంటామని ఆయన తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1612.65	1,587.89
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	7,951	142
నీటి నిల్వ (టీఎంసీలు)	43.07	9.36

నేడు 'నాగలాదేవి' పుస్తకావిష్కరణ

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజ్‌కుమార్ రోడ్డులోని రాఘవ కళామందిరంలో సాయంకాలం భగీరథ రచించిన చారిత్రాత్మక నాగలాదేవి పుస్తకావిష్కరణ (శ్రీకృష్ణదేవరాయల ప్రేమ కథ) జరగనుంది. ఈకార్యక్రమానికి సభాధ్యక్షుడిగా కళారత్న బిక్కికృష్ణ భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ హైదారాబాద్. ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నారు. నారా సూర్యనారాయణరెడ్డి, గౌరవ అతిథిగా ఎస్పీ శోభరాణి, విశేష అతిథులుగా విమల సాహితి అధ్యక్షుడు విద్యాధరరావు హైదరాబాద్.కోటేశ్వరావు ప్రముఖ న్యాయవాది. గాదెం గోపాలకృష్ణ, ఆర్.దేవణ్ణ,సుందర్‌రావు పాల్గొననున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. అమరేంద్రనాథ్ చౌదరి, సుంకణ్ణ బృందం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలుగు సంస్కృతి సమితి కార్యదర్శి ప్రభాకర్, బలిజ సంఘం అధ్యక్షుడు రమేశ్‌బుజ్జి తెలిపారు. భాష సాహితీ, కళాభిమానులందరు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

నిరుపయోగంగా బస్సు షెల్టర్లు..!

● పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు ● ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు ● రూ.లక్షల ప్రజాధనం వృథా



నిరుపయోగంగా మారిన బస్ షెల్టర్

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన కూడళ్లలో ప్రయాణికుల కోసం నిర్మించిన బస్సు షెల్టర్లు నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. గతంలో అధికారంలో ఉన్న బీజేపీ పాలనలో నగరంలోని ప్రధాన కూడళ్లలో ప్రజా ప్రతినిధుల బొమ్మలతో కూడిన బోర్డులతో లక్షల రూపాయలు వెచ్చించి బస్ స్టాపులు ఏర్పాటు చేశారు. అయితే బీజేపీ పాలన ముగిశాక వాటిని పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. కొన్ని చోట్ల శిథిలమైన బస్‌స్టాప్‌లు ఫుట్‌పాత్ వ్యాపారులకు నిలయాలుగా మారాయి. ఈ కారణంగా బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు రోడ్ల ప్రక్కన, మండుటెండల్లో గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. బస్సు షెల్టర్ల నిర్వహణ బాధ్యతలు చేపట్టిన కార్పొరేషన్ అధికారులు శిథిలావస్థకు చేరుకున్న షెల్టర్లకు మరమ్మతులు చేయడం గాని, వాటి స్థానంలో కొత్తవి నిర్మించడం కానీ చేయకపోవడంతో అవి శిథిలావస్థకు చేరకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు వాటికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి

సమాజ సేవకులు రెక్కల వెంకట రెడ్డి




నగరంలోని ప్రధాన సర్కిళ్లలో నిరుపయోగంగా ఉన్న బస్సు షెల్టర్లకు మరమ్మతులు చేపట్టాలి. నిర్వహణకు అవసరమైన నిధులు లేవని అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఈ విషయంలో జిల్లా పాలనా మండలి చొరవ చూపాలి. వచ్చే ఎండాకాలంలో ప్రయాణికులు తిప్పలు తప్పాలంటే షెల్టర్లను పునర్దురించాలి. జిల్లా పరిధిలో పదుల సంఖ్యలో ఉక్కు, మైనింగ్ పరిశ్రమలు ఉన్నాయి. నగరంలో పారిశ్రామిక వాడలో ఎన్నో ఫ్యాక్టరీలు ఉన్నాయి. స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో పారిశ్రామిక వేత్తలతో సమావేశమై పార్కులు, బస్సు షెల్టర్ల నిర్వహణ బాధ్యతలు అప్పగించేలా జిల్లా పాలనా మండలి చర్యలు తీసుకోవాలి.

25 నుంచి హంపిలో ధ్వనిబెళకు ప్రారంభం

కంప్లి, ఫిబ్రవరి 15(ఆంధ్ర జ్యోతి): హంపి ఉత్సవాలకు మూడు రోజుల ముందుగానే ఈ నెల 25 నుంచి గజశాల వద్ద ధ్వనిబెళకు కార్యక్రమం ప్రారంభమవుతున్నట్లు జిల్లా అధికారి ఎంఎస్ దివాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే వేదికల్లో ముమ్మరంగా పనులు సాగుతున్నాయి. హంపి ఉత్సవాలకు వచ్చే మహిళలకు శౌచాలయాల ఏర్పాటు, స్వచ్ఛత, పరిశుభ్రం ఇతర పనులు జోరుగా సాగుతున్నాయన్నారు. ఉత్సవాలకు విజయనగర, బళ్లారి జిల్లా ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి

హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి



అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : సనాతన ధర్మాన్ని, హైందవ ధర్మాన్ని కాపాడుకోవాలని హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి పేర్కొన్నారు. జిల్లా కేంద్రం ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మహా కుంభాభిషేక వేడుకలు రెండో రోజు శనివారం కొనసాగాయి. ఉదయం ఆలయ ఆవరణలో 108 జంటలతో సామూహికంగా గణపతి, నవగ్రహ, లక్ష్మీనారాయణ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి గావించారు. సాయంత్రం హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతీ స్వామి హాజరై లక్ష్మీవెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో ఆయన భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. ఎంతోమంది మహనీయులు దేశపర్యటనలు చేసి హిందూ సంప్రదాయాన్ని వ్యాపింపజేశారన్నారు. పాశ్చాత్య సంస్కృతి నుంచి ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలన్నారు.



మహిళలకు కిట్లు అందజేస్తున్న జడ్పీ సీఈఓ రాహుల్‌శరణప్ప

సృజనాత్మకతతో స్వయం ఉపాధి

● జడ్పీ సీఈఓ రాహుల్ శరణప్ప

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సృజనాత్మకతతో, 'నైపుణ్య శిక్షణతో స్వయం ఉపాధి పొంది సులభంగా జీవించవచ్చని జిల్లాపంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప అన్నారు. శనివారం కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 30రోజుల బ్యూటీ పార్లర్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రాంరభించి మాట్లాడారు. నేటి కాలంలో మహిళలు అందానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని, బ్యూటీ పార్లర్‌లో వివిధ మేకప్ నైపుణ్యాలను పెంపొందించుకోవావాలన్నారు. ఈకార్యక్రమంలో 34 మంది మహిళలకు బ్యూటీ పార్లర్ టూల్‌కిట్లు , సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా జడ్పీ డిప్యూటీ సెక్రటరీ గిరిజా శంకర్ , జడ్పీ ప్లానింగ్ డైరెక్టర్ వినోద్, అసిస్టెంట్ డైరెక్టర్ బసవరాజ్ హిరేమఠ్, జడ్పీ ఎన్ఆర్ఎల్ఎంలు రాజేంద్ర, రఘువర్మ, లెక్చరర్లు జడప్ప, దినేశ్ , సిద్దలింగమ్మ,సంతోషకుమార్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

సేవాలాల్ బోధనలతో బంజారాల్లో చైతన్యం

● అసోసియేట్ ప్రొఫెసర్ నాగేంద్ర నాయక్



బళ్లారిలో సేవాలాల్‌కు నివాళి అర్పిస్తున్న బంజారా నాయకులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సేవాలాల్ తన బోధనల ద్వారా బంజరాల్లో చైతన్యం కల్పించారని, మానవత్వం అతీంద్రియంగా మారాలని బోధించారని శివమొగ్గ జిల్లా అసోసియేట్ ప్రొఫెసర్ నాగేంద్ర నాయక్ అన్నారు. జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ, కన్నడ సాంస్కృతిక శాఖ, మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని జోళదరాశి దొడ్డనగౌడ రంగ మందిరంలో శనివారం నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి కార్యక్రమంలో ఆయన ప్రత్యేక ఉపన్యాసంలో మాట్లాడారు. సేవాలాల్ తనబోధనల ద్వారా ప్రపంచానికి జ్ఞానం ద్వారా విముక్తి మార్గాన్ని చూపించారు. 1739లో దావణగెర జిల్లా సూరగొండనకొప్ప గ్రామంలో భీమానాయక్, ధర్మిణి దంపతలకు సేవాలాల్ జన్మించారు. సూరనగొండనకొప్పలో అనేక అద్భుతాలు చేశారన్నారు. బంజారాలు ఈ దివ్యపురుషుడిని మోటివాలో, లాల్‌మోతి అని పిలుస్తారన్నారు. మరియమ్మదేవి నుంచి పొందిన దైవిక శక్తిని ఉపయోగించి బంజారాలతో సహా సంచార వర్గాలను రక్షించిన సాధువు అని నేటికీ కథలు వ్యాపించాయి. మహారాష్ట్రలోని పొరాగడ్ (పొరదేవి స్థలంలో) సేవాలాల్ ఐక్యమయ్యారని చరిత్ర చెబుతుందన్నారు.

నగరంలో ఊరేగింపు

సంత్‌సేవాలాల్ జయంతిలో భాగంగా నిర్వహించిన ఊరేగింపు ఎంతో ఉత్సాహంగా జరిగింది. నగరంలోని డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్డులోని మున్సిపల్ కళాశాల మైదానంలో ఉన్న సెయింట్ సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించిన మహానగర పాలికె మాజీ మేయర్ శ్వేత ఊరేగింపును జెండా ఊపి ప్రారంభించారు. వివిధ కళాబృందాలతో ఊరేగింపు నగరంలోని మున్సిపల్ కళాశాల మైదానం నుంచి ప్రారంభమై గడిగిచెన్నప్ప సర్కిల్,బెంగళూరు రోడ్డు మీదుగా సాగి రంగమందిరానికి చేరుకుంది. కన్నడ సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగరాజు, జిల్లాసేవాలాల్ బంజారా సంఘం అధ్యక్షుడు రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బళ్లారిరూరల్ : సంత్ సేవాలాల్ జయంతిని నగరంలోని సిరుగుప్ప రోడ్డు మాజీ మంత్రి శ్రీరాములు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. శనివారం మాజీ మంత్రి శ్రీరాములు సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ భారతదేశ సాంస్కృతిక రాయభారి అని, బంజారాల అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఎందరో సాధువులు కులనివారణకు కృషి చేశారన్నారు. అటువంటి గొప్పసాధువుల్లో లంబాడి సమాజపు ఆరాధ్య దైవం సద్గురు సేవాలాల్ మహారాజ్ అని ప్రశంసించారు. కార్యక్రమంలో బంజారా నాయకులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి శ్రీరాములు, లంబాడి నాయకుల నివాళి

రాయచూరు : సంత్ సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని శనివారం నగరంలో స్థానిక రంగమందిరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాన్ని రాయచూరు గ్రేడ్-2 తహసీల్దార్ భీమరాయ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంత్ సేవాలాల్ వంటి మహనీయుల మార్గ దర్శకత్వం నేటి సమాజానికి అత్యవసరమని, ఆయన చూసిన మార్గంలో పయనించడం ద్వార ఉత్తమ సమాజ స్థాపన సాధ్యమని అభిప్రాయపడ్డారు. సమాజాన్ని సన్మార్గంలో నడిపేందుకు అవిరళ కృషి కల్పిన సంత సేవాలాల్ వంటి మహనీయులను స్మరించడం విధిగా భావించాలన్నారు. ఉన్నత నీతి, నైతిక విలువలు, సత్య వాక్కు వంటి సద్గుణాలను సమాజానికి నేర్పించిన సంత సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించడం పట్ల ప్రభుత్వాన్ని అభినందించారు. జిల్లా యంత్రాంగం, జడ్పీ, నగరసభ, కన్నడ మరియు సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖులను సన్మానించారు.



రాయచూరులో అధికారుల నివాళి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ నాగేంద్రనాయక్



ఊరేగింపులో బంజారాలు

మార్చిలో జిల్లా కోర్టు ప్రారంభం : ఎమ్మెల్యే



భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గవియప్ప, న్యాయాధికారులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడిన విజయనగరం జిల్లాకు మంజూరు చేసిన జిల్లాకోర్టు వచ్చే నెల నెంచి పనిచేయడం ప్రారంభిస్తుందని ఎమ్మెల్యే హెచ్.ఆర్.గవియప్ప అన్నారు. శనివారం అనేకక మంది జిల్లా స్థాయి న్యాయాధికారులతో కలిసి కోర్టు భవనాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా మేజిస్ట్రేట్ కార్యాయం సమీపంలో కొత్త కోర్టు సముదాయం నిర్మించబడే వరకు జిల్లా కోర్టు ఇక్కడే పనిచేస్తుందన్నారు. కొత్త కోర్టుకు సిబ్బంది నియామక ప్రక్రియ ప్రారంభమయ్యిందన్నారు. జిల్లాన్యాయమూర్తి వాటన్నింటినీ పర్యవేక్షిస్తున్నారన్నారు. జిల్లాకోర్టు భవనంతో సహా జిల్లాపరిపాలన సముదాయ నిర్మాణానికి రూ. 200కోట్లకు పైగా తక్షణ గ్రాంట్ విడుదల అయ్యిందన్నారు. కేకేఆర్‌డీబీ నిధులు అందించాలనే డిమాండ్ ఉందని ఎమ్మెల్యే అన్నారు. హొసపేట గనుల ప్రభావిత ప్రాంతం కాబట్టి డీఎంఎఫ్ నిధులను ఇవ్వాలని నేను డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు, లా కళాశాలల నిర్మాణానికి అవసరమైన చర్యలు కూడా తీసుకుంటామన్నారు. జిల్లా పరిపాలన సముదాయం నిర్మాణం.తర్వాత కార్యాలయాల సమస్య పరిష్కారమవుతుందని, జిల్లా పరిపాలన సముదాయం పనులను త్వరగా చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు.

పేటె ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో హనుమంతుడు

సిరుగుప్ప, ఫిబ్రవరి 15 (ఆంధ్ర జ్యోతి) : పేటె ఆంజనేయస్వామికి శనివారం ఘనంగా పూజలు నిర్వహించారు. పట్టణంలోని దేశనూరు మార్గంలో వెలసిన ఆంజనేయస్వామికి పుష్పాలంకార సేవలు, ఆకుపూజ, కుంకుమాభిషేకం, పంచామృతాభిషేకం చేపట్టారు. ప్రధాన అర్చకులు శ్యామాచార్య మహామంగళ హారతి చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద పంపిణీ చేశారు.

ప్రతి పాఠశాలలో యోగా నిర్వహించాలి

● ప్రముఖులు జోళదరాశి తిమ్మప్ప



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించిన సంస్థ ప్రతినిధులు

తోరణగల్లు, ఫిబ్రవరి 15(ఆంధ్ర జ్యోతి): ప్రతి పాఠశాలలో యోగా కార్యక్రమాలు నిర్వహించాలని సాంస్కృతిక ప్రముఖులు జోళదరాశి తిమ్మప్ప పేర్కొన్నారు. బళ్లారి జిల్లా హరిగిణదోణి ప్రభుత్వ పాఠశాలలో జీటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. అఖండ కర్ణాటక వాల్మీకి నాయక ఒక్కట రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మప్ప జిల్లా ఆయుష్ ఆరోగ్య మందిర కురేకుప్ప ఎస్ఆర్‌కే యోగి కేంద్రం రాఘవేంద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. 108 మంది విద్యార్థులు వజ్రాసనంలో ఓంకార ధ్వనితో కూర్చొని విశ్వ రికార్డు చేసే ప్రయత్నంలో విజయవంతమయ్యారు. ఈసందర్భంగా బళ్లారి జాగదిగా యోగద ఉపాధ్యక్షుడు చిదంబర రావు, రుద్రప్ప, రుద్రముని పాఠశాల ముఖ్య ఉపాధ్యాయులు జీవా మేడం ముఖ్య శిక్షకులు వనజాక్షమ్మ, విశ్వయోగి ప్రశస్తి విజేతలు కురేకుప్ప, పట్టణ ఎస్ఆర్‌కే యోగా కేంద్ర గురువులు ఏ రాఘవేంద్రపంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై నిర్లక్ష్యం వహించరాదు

● అధికారులకు లోకాయుక్త సీఐ సూచన



ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీఐ సంగమేష

సిరుగుప్ప, ఫిబ్రవరి 15 (ఆంధ్ర జ్యోతి) : ప్రజాసమస్యలపై నిర్లక్ష్యం వహించడం తగదని లోకాయుక్త సీఐ సంగమేష తెలిపారు. శనివారం సిరుగుప్ప పట్టణం శిశు అభివృద్ధి యోజన కార్యాలయంలో లోకాయుక్త అధికారులు తాలుకా ప్రజల నుంచి దరఖాస్తులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వాధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రజలు సమస్యల నిమిత్తం కార్యాలయాలను సందర్శిస్తే అధికారులు అవినీతికి పాల్పడకుండా ప్రజల సమస్యలపై స్పందించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా జెస్కామ్, ఆర్టీసీ, ఆర్టీవో, నగరసభపై సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించారు.

హోసూరు జోన్

ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులకు ఇబ్బందులు



ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోయిన ప్రజలు

హోసూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్ర జ్యోతి): హోసూరు బాగలూరు రహదారికి కుడివైపున జీఆర్‌టీ నుంచి ప్రారంభమైతే సమత్వపురం వరకు వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. పాదచారులు కూడా సులభంగా రోడ్డును దాటలేని పరిస్థితి. హోసూరు - బాగలూరు రహదారి కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ జిల్లాకు అనుసంధానించే రహదారి కావడంతో రెండు రాష్ట్రాలకు చెందిన వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. ఈ మార్గంలో మాలూరు, బంగారుపేట, కోలారు వంటి నగరాలకు 24 గంటలూ నిరంతరాయంగా వాహనాల సంచారం ఉంటుంది. ఇందులో సర్జాపురకు వెళ్లే వాహనాలు కూడా ఎక్కువగా ఉంటారు. ప్రైవేట్ కార్యాలయాలు, ప్రైవేట్ పాఠశాలలు, కార్పొరేషన్ కార్యాలయం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పార్క్ ప్రాంతీయ రవాణా కార్యాలయం మొదలైన నివాస ప్రాంతాలు ఉన్నందున హోసూరు-బాగలూరు రహదారి ఎల్లప్పుడూ రద్దీగా ఉంటుంది. 24 గంటల పాటు రద్దీగా ఉండే ఈ రహదారిపై ఉన్న ఆసుపత్రులు, పాఠశాలలు , కార్యాలయాలకు వెళ్లే ప్రజలు కనీసం 30 నిమిషాల పాటు రోడ్డు ప్రక్కన వేచి ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. హోసూరు-బాగలూరు రహదారిపై పెరుగుతున్న వాహనాల రద్దీని తగ్గించేందుకు, ఈ రహదారిపై జీఆర్‌టీ నుంచి సమత్వపురం వరకు ఫ్లైఓవర్ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. హోసూరులోని జిల్లా కలెక్టర్ కార్యాలయం రోడ్డులో ఫుట్‌పాత్ లేకపోవడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కార్యాలయం రోడ్డుకు ఇరువైపులా పాదచారులు వెళ్లేందుకు అనుకూలం చేయల్సిందిగా ప్రజలు కోరుతున్నారు. హోసూరు కార్పొరేషన్‌లోని మహాత్మాగాంధీ రోడ్డు, చెరువువీధి, పాత బెంగళూరు రోడ్డు, నేతాజీ రోడ్డులో కూడా ట్రాఫిక్ జామ్ అధికంగా ఉంది. ట్రాఫిక్‌రద్దీ నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు, పాదచారులు కోరుతున్నారు.

నిమ్మకాయలు కిలో రూ.60

హోసూరు ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): హోసూరులో నిమ్మకాయ ధరలు పెరగడంతో సాగు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేసవికాలం ప్రారంభం కావడంతో దాహం తీర్చుకునేందుకు నిమ్మకాయ, కొబ్బరిబోండా, పుచ్చకాయలు, కీరదోస, పండ్లరసాలు కొనుగోలు చేసి తాగుతున్నారు. శరీరాన్ని చల్లబరిచే వాటిలో నిమ్మరసం కూడా ఒకటి. ఇలా నిమ్మకాయలకు డిమాండ్ పెరిగింది. శనివారం కిలో నిమ్మకాయలు హోల్‌సేల్‌గా రూ.60-రూ.70 వరకు విక్రయించారు. చిల్లర దుకాణాలో రూ.80 నుంచి 100 దాకా విక్రయిస్తున్నారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో రైతులు మాట్లాడుతూ ఎండల కారణంగా నిమ్మకాయల దిగుబడి తగ్గినా మార్కెట్‌లో డిమాండ్ పెరగడంతో అధిక లాభాలు వస్తున్నాయన్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న నిమ్మకాయలు



అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ దినేశ్ కుమార్

కాలువల నిర్మాణాన్ని పరిశీలించిన కలెక్టర్

హోసూరు(కృష్ణగిరి), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జలవనరులశాఖ ఆధ్వర్యంలో ఎన్నేకల్ ఆనకట్ట కుడి, ఎడమ వైపు నుంచి రూ.233.34 కోట్ల విలువైన కొత్త సరఫరా కాలువల నిర్మాణాన్ని కలెక్టర్ సీ దినేశ్‌కుమార్ శనివారం పరిశీలించారు. కృష్ణగిరి జిల్లా కావేరిపట్టణం పంచాయతీ, కత్తేరిమెల్కోట్టై, వేపనపల్లి పంచాయతీ యూనియన్, ఎన్నేకోల్ డ్యామ్ బ్లాక్ జీరో పాయింట్, 400 మీటర్ల దూరంలో కొత్త కాలువ నిర్మాణాలు చేపట్టారు. అనంతరం కృష్ణగిరి డ్యాంను జిల్లా కలెక్టర్ స్వయంగా సందర్శించారు. డ్యాం నీటి సామర్థ్యం, నీటి ఇన్‌ఫ్లో, ఆయకట్టు సాగునీటికి విడుదల చేసిన నీటి పరిమాణంపై ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. తనిఖీలో జలవనరుల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అరివొలి, అసిస్టెంట్, ఇంజనీర్ మోహన్, కార్తికేయ సహ శాఖాధికారులు పాల్గొన్నారు.

భోజన గది నిర్మాణానికి భూమిపూజ

హోసూరు ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): హోసూరు అందివాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బెంగళూరులోని కివాని కర్మాగారం సీఎస్ఆర్ ద్వారా సుమారు రూ.10 లక్షలతో విద్యార్థులు కూర్చొని భోజనం చేసేందుకు భూమి పూజ నిర్వహించారు. ఫ్యాక్టరీ మేనేజర్ శివకుమార్, కురింజి నగర్ గోపాలప్ప, అసోసియేషన్ ప్రెసిడెంట్, పన్నుల స్థాయి కమిటీ చైర్మెన్ చెన్నీరప్ప పాల్గొన్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాల ప్రగతికి సంస్థలు, ఫ్యాక్టరీలు సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో 36వ వార్డు సభ్యురాలు భాగ్యలక్ష్మీ అన్నాదురై, గోపాల్, గోపి, నాగేశ్, నాగరాజు, వెంకటేశ్, రామచంద్రన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోషకాహార సిబ్బంది పాల్గొన్నారు.



భూమి పూజలో కివాని సంస్థ ప్రతినిధులు, స్థానిక నాయకులు